# శలవుకోసం ప్రసవవేదన

* వ రా శాస్త్రి *

మా ఆవిడకు తొమ్మిదో మాసం కూడా దాటిందనీ, ఇవ్వాళ రేపట్లో పురుడొచ్చే సూచనలు కనబడుతున్నాయనీ, తొలి కాన్పు కాబట్టి పుట్టింటికి నేను కూడా అక్కడ హాజరు కావటం మంచిదనీ, మా బావమరిది వ్రాసిన జాబు నాలో చెప్పలేని కలత కలిగించింది.

అత్తారి వూరు పోవటం యెట్లా అన్నది నేను వెంటనే యెదుర్కోవలసిన పెద్ద సమస్యయింది. ఎట్లా పోవటం అంటే రైల్లోనా, కారులోనా లేక కాలినడకనా? అని కాదు సుమండీ అసలెట్లా పోటానికయినా శెలవు అంటూ ఒకటి కావొద్దూ ” వారంరోజుల శెలవుకని కనీసం నెల దినాలముందైనా దరఖాస్తు దాఖలు చేసుకోకపోతే పాపం దానిపాట్లు కుక్కలకయినా వుండవు.

★

మా అక్కౌంటెంటు రామానికి, ఆఫీసరుగారి అమ్మాయి సుజాతతో భలే దోస్తీ అన్నమాట చటుక్కున గుర్తుకొచ్చింది. ఓ వారంరోజుల పాటు శెలవిప్పించేలా ఆమెచేత వాళ్ల నాన్నగారికి సిఫారుసు చేయించమని రామాన్ని బ్రతిమాలుకుందామనుకున్నా. ఆఫీసరుగారికి సుజాత లేక లేక కలిగిన అమ్మాయి కాబట్టి ఆమెమాట యెన్నడూ కాదనడాయన.

కాని, హరిశ్చంద్రుడి వెనక నక్షత్రకుడిలా యీ చక్కటి ఆలోచన వెనకే ఒక ధర్మసందేహం బయలుదేరింది. సుజాతతో వాడికి భలే దోస్తీ అన్న సంగతి మా కెవ్వరికీ తెలియదని రామం నమ్మకం. అట్లాంటప్పుడు నే కాస్తా యీ విషయాన్ని వాడిముందే బయటపెడితే యెక్కడ విరుచుకొని పడతాడో అన్న సందేహం కలిగింది. పైగా యీ చిదంబరరహస్యం కాస్తా నా చెవిని పడిపోయినట్టు తెలుసుకుని నన్ను పూర్తిగా వెళ్లగొట్టేందుకే సిఫారుసు చేయిస్తాడేమోనని భయంవేసింది. ఒళ్లంతా ఒక్కసారి కంపించింది. ఆ ఆలోచనను వెంటనే త్రోసిపారేశా.

★

ఈ మాటు మా ఆఫీసరుగారి ప్రైవేటు సెక్రటరీ మేరీ జ్ఞాపకమొచ్చింది. మేరీ మా ఆఫీసులో అడుగుపెట్టి అట్టేకాలం కాలేదు. అయినా మా ఆఫీసరుగారి అంత దయను అమాంతంగా సంపాదించేసింది ఆ కొద్దికాలంలోనే. మేం అంతా యేళ్ళతరబడి కొట్టుకుంటున్నా అందులో వెయ్యోవంతైనా సంపాదించుకోలేకపోయాం! పైగా మమ్మల్ని చూస్తే మా ఆఫీసరుగారికి అరికాలిమంట నెత్తికెక్కుతుంది.

మేరీ మా ఆఫీసులో ప్రవేశించిననాడే మమ్మల్నందరిని మా ఆఫీసరుగారు పిలిచి ఆమెతో అనవసరంగా అధిక ప్రసంగం చెయ్యకూడదని, వెఱ్ఱి వెఱ్ఱిగా ఆమెవేపు చూడకూడదని, తలో వార్నింగు యిచ్చేశారు. అంతటితో వూరుకున్నారా? దానికి మరికొన్ని నిబంధనలు కలిపి, కాగితంపై సైను చేయించి, నోటీసుబోర్డులో అంటింపించేశారు. ఆ కాగితం సైను చేసింది నా వ్రేళ్ళే!

ఆఫీసు ఆర్డరు ప్రకారం యీ విషయాన్ని గురించి మేరీతో ఆఫీసులో మాట్లాడేందుకు వీలు లేదు. అవును, నా స్వంతవిషయాలతో ఆఫీసుకేం సంబంధం? అంచేత యిది అధికప్రసంగం క్రిందే వస్తుంది. ఆ రాత్రి ఆమె యింటికి పోయి నాకో వారంరోజులు శెలవిప్పించమని ఆఫీసరుగారికి రికమండు చెయ్యమని ఆమెను ప్రార్థి

MGB

SHARK
liver OIL

స్టాండర్డైజ్డు విటమిన్ ఆయిల్

ప్రతి గ్రాముకు 1500 ఐ. యు. జీ. ల 'ఏ' జీవశక్తులు, 100 ఐ. యు. జీ. ల 'డి' జీవశక్తులు కలిగియున్నది. దిగుమతి అయ్యే కాడ్లివరాయిలున్న కంటె ఎంతో ప్రశస్తమైనది ఆహారపుష్టి తక్కువగ నుంటున్న ఈ రోజులలో ఇది మంచి పుష్టికరమైన ఆహారముగా నుపయోగించును.

GOVERNMENT OIL FACTORY,
Calicut

ads 161

★

మద్రాసు రాజధాని, పరిసర సంస్థానములకు

ఏజంటు :

ప్యారి అండ్ కో., లిమిటెడ్

మదరాస్.

ద్దామనుకున్నా: కాని బుఱ్ఱలో ఆలోచన కన్న సందేహాలు అధికమయ్యాయి.

ఇక్కడ యీ మాటు రెండుసందేహాలు బయలుదేరాయి రాత్రివేళ యింటికెళితే మేరీ యేమనుకుంటుందో అని ఒకటి. మా ఆఫీసరుగారికి చీకటి పడగానే రోజూ ఆమె యింటికి వెళ్ళే అలవాటొకటి వుంది. తీరా నే వెళ్ళేసరికి, ఆయనకూడా అక్కడకు వస్తే అసలు వుద్యోగమే వూడి చక్కాపోతుందని మరొకటి ఇహ అక్కడితో విసుగెత్తింది.

★

"వీళ్ళ కాళ్ళు, వాళ్ళ కాళ్ళు పట్టుకునేదేమిటోయ్, నీ స్వదస్తూరీలోనే ఒక దరఖాస్తు వ్రాసేసి, సూటిగా ఆఫీసరు గారికి నీ స్వహస్తాలతోనే అందజేసెయ్యి" అని ఆత్మారాముడు చెప్పాడు.

"శభాష్" అనుకుని ఆఫీసరుగారి హృదయకూపం అయిసులా కరిగిపోయేలాటి వాఙ్మయంతో అతిగా ఒక దరఖాస్తు వ్రాసేశా.

★

ఆ మర్నాడు రోజూకంటె కాస్త పెందరాళే పోయా ఆఫీసుకి. నా బల్లపైన యెంతసేపటిబట్టి నిరీక్షిస్తోందో పాపం ఆ టెలిగ్రాం. కవరు పై అంచు నిర్దాక్షిణ్యంగా చించేసి లోపలి కాగితంలోని సంగతులు చదివా. బందరు వుప్పెనలా హృదయం ఒక్కసారి పొంగింది ఆనందంతో.

ఆ క్రితంనాటి సాయంత్రమే మా ఆవిడ మంచి నక్షత్రాన్ని యెంచుకుని ఓ రత్నంలాంటి పుత్రుణ్ణి కనినట్టు, మా బావమరిది వెంకట్రావ్ ఆ టెలిగ్రాంద్వారా తెలియపర్చాడు.

మా ఆవిడ కాంతం నిసలు హైందవనారీమణి అని ఆ నాడు తెలుసుకున్నా. నాకు సెలవు దొరకటం యెంత దుర్లభమో ఆమె గ్రహించుకుంది. నేను తన ప్రక్కన—అంటే ప్రక్క గదిలో అయినా లేకుండానే ఆ కాస్తపని పాపం తనే ముగించేసుకుంది. సీత, సావిత్రి, అనసూయ వగైరా పతివ్రతలలోని పాతివ్రత్యాన్ని కాస్తయినా వదిలెయ్యకుండా అంతా తీసి, మా కాంతంలో పోసి, ఆమెను నాకు ధర్మపత్నిగా చేసిన భగవంతుణ్ణి కొనియాడుకున్నా. కోటుజేబులోంచి దరఖాస్తుని పెకిలాగి ముక్కముక్కలుగా చిత్రవధ చేస్తూ కుర్చీలో కూర్చున్నా.